సాక్షి
ఖమ్మం
గురువారం, 16 అక్టోబర్, 2025



పిల్లల్లో పోషణ లోపం

పలువురు చిన్నారులు పోషకాహారం లోపం. తక్కువ బరువుతో ఉన్నట్లు గుర్తించగా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. 10లో



పాఠశాలలకు క్యాలెండర్లు

విద్యాసంబంధిత విషయాలే కాక సెలవులు, సమావేశాల వివరాలతో క్యాలెండర్లను పాఠశాలలకు ప్రభుత్వం అందిస్తోంది. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
32° / 22°

వాతావరణం

జిల్లాలో గురువారం ఎండ ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత తీవ్రత మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆర్‌ఎం, అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: కార్తీక మాసంలో పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ బస్సులు నడిపించనున్నట్లు ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ ఏ.సరిరామ్ తెలిపారు. ఖమ్మంలో బుధవారం ఆయన డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ రీజియన్‌లోని ఏడు డిపోల నుంచి అన్నవరం, పంచారామాలకు సూపర్‌లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడపాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్తీకమాసంలో ప్రతీ ఆదివారం రాత్రి 8 గంటలకు అన్ని బస్టాండ్ల నుండి బస్సులు బయలుదేరేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం యాత్రల వివరాలతో కూడిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం మల్లయ్య, పీఓ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కరాటే శిక్షణ

ఖమ్మం స్పోర్ట్స్: బాలికల ఆత్మరక్షణ కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా కరాటే శిక్షణ ఇవ్వనున్నట్లు డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని 25 పాఠశాలల్లో మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, వారానికి ఆరు సెషన్లు మించకుండా 24తరగతులు నిర్వహించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. కాగా, కరాటే శిక్షణకు మహిళలకు ప్రాధాన్యత ఇస్తామని, ఎక్కడైనా అందుబాటులో లేకపోతే పురుషులకు అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. రూ.10వేల గౌరవ వేతనం ఇవ్వనుండగా, బ్లాక్ బెల్ట్ ఉన్న వారు ఈనెల 18వ తేదీ మధ్యాహ్నం 2గంటల్లోగా సర్దార్ పటేల్ స్టేడియంలోని తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని డీవైఎస్‌ఓ సూచించారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు

ఖమ్మం సహకారనగర్: పెనుబల్లి మండలం ఏరుగట్లలో నిర్మాణం పూర్తయిన -40 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో లబ్ధిదారుల సమక్షాన ఇళ్లు కేటాయించామని జిల్లా రెవెన్యూ అధికారి ఏ.పద్మశ్రీ తెలిపారు. గతంలోనే లబ్ధిదారులను ఎంపిక చేయగా, ర్యాండమైజేషన్ ద్వారా ఇళ్ల కేటాయింపు చేపట్టామని చెప్పారు. ఈకార్యక్రమంలో ఈడీఎం దుర్గాప్రసాద్, ఉద్యోగులు రాజశేఖర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పోలీసు శాఖ ఆధ్వర్యాన ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలు

ఖమ్మంక్రైం: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం(ఫ్లాగ్ డే)ను పురస్కరించుకుని రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. పోలీసుల త్యాగాలు, విధుల్లో వారి ప్రతిభను చాటేలా తీసిన మూడు ఫొటోలు, మూడు నిమిషాల లోపు నిడివితో రూపొందించిన షార్ట్‌ఫిల్మ్ పెన్‌డ్రైవ్‌లను తమ కార్యాలయంలో ఈనెల 22వ తేదీలోగా అందజేయాలని సూచించారు. గత ఏడాది అక్టోబర్ నుండి ఈ ఏడాది అక్టోబర్ వరకు తీసిన ఫొటోలు, షార్ట్ ఫిల్మ్‌లనే సమర్పించాలని తెలిపారు. వివరాల కోసం 87126 59256 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణగా వించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

హద్దులు దాటుతున్న ఇసుక

ఏపీ నుంచి తెలంగాణకు లారీల్లో తరలింపు

- అక్కడి ఉచిత ఇసుక పాలసీ ఆధారంగా అక్రమార్జన
- అశ్వారావుపేట, సత్తుపల్లి మీదుగా ఖమ్మం, హైదరాబాద్‌కు..





ఉమ్మడి జిల్లా - ఏపీ సరిహద్దులో పట్టుబడిన లారీలు (ఇన్‌సెట్) సీజ్ అయిన లారీలపై నేషనల్ హైవే అథారిటీ స్టిక్కర్, నంబర్ కానరాకుండా తొలగించిన అక్షరాలు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పాలసీ ఆధారంగా కొందరు ఇసుకను రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. ఈ తతంగం వెనుక అక్కడి అధికార పార్టీ నేతలున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఏపీలో అవసరాల కోసమంటూ ఇసుకను తెలంగాణలోని అశ్వారావుపేట, సత్తుపల్లి మీదుగా ఖమ్మం, హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. అయితే, అక్రమ రవాణాను రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి. ఏపీ, తెలంగాణ సరిహద్దులో ఇటీవల పదుల సంఖ్యలో ఇసుక లారీలు (టిప్పర్లు) పట్టుబడడం అక్రమ రవాణాను బయటపెట్టింది.

దర్జాగా సరిహద్దులు దాటించి..

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక పథకాన్ని ప్రవేశపెట్టింది. నిరుపేదల కోసమంటూ ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని అక్కడి అధికార పార్టీ నేతలు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. అక్కడి ఇసుక రీచ్‌లు, స్టాక్ పాయింట్ల నుంచి నిర్మాణాల పేరుతో అనుమతి తీసుకుని టన్నుకు రూ.250 నుంచి రూ.500 వరకు చెల్లిస్తారు. ఆపై అనుమతి తీసుకున్న ప్రాంతానికి కాకుండా విజయవాడ, కొవ్వూరు సమీపం నుంచి తెలంగాణలోని అశ్వారావుపేట, సత్తుపల్లి మీదుగా ఖమ్మం, హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తూ వ్యాపారం కొనసాగిస్తున్నారు.

రోజుకు 50 - 100 లారీలు

ఉచిత ఇసుక పథకం ద్వారా అనుమతి తీసుకున్న చోటకు కాకుండా ఇంకో చోటకు తరలిస్తున్నారు. తెలంగాణ సమీపాన ఆంధ్రా సరిహద్దుల వెంట ఇసుక డంప్ చేసి వ్యాపారం చేస్తున్నారు. 50 టన్నులు ఉన్న లారీకి రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు చెల్లిస్తారు. అదే ఇసుకను హైదరాబాద్‌లో టన్నుకు రూ.3వేల నుంచి రూ.3,500 వరకు విక్రయిస్తారు. ఇలా ఒక లారీ బయటకు వస్తే రూ.1.25 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు వస్తుండగా.. ఖర్చులు పోగా లారీకి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు మిగులుతాయి. ఇలా ప్రతీరోజు 50 నుంచి 100 లారీల ఇసుకను వివిధ మార్గాల్లో హైదరాబాద్ తరలిస్తున్నారనే ఆరోపణలు న్నాయి.

ప్రణాళికాయుతంగా...

ఇసుక దందాను అక్రమార్కులు తెలివిగా నడిపిస్తున్నారు. ఎక్కడి నుంచి.. ఎప్పుడు .. ఎలా తరలించాలన్న అంశంపై ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమాన ఇసుక తరలించే కొన్ని లారీలకు నంబర్ ప్లేట్లు తొలగిస్తున్నారు. లేకపోతే నేషనల్ హైవే అథారిటీ అవసరాల కోసమంటూ స్టిక్కర్లు వేస్తున్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు ఇసుక తరలిస్తున్నామని చెబుతూ తెలంగాణలో డంప్ చేస్తున్నారు. కొన్నిసార్లయితే టైల్స్, జిప్సం పౌడర్ అని చెబుతూ లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక తరలిస్తున్నారు.

అప్పుడప్పుడు పట్టుబడుతూ..

ఇటీవల అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీలను పోలీసులు పట్టుకున్నారు. కొన్ని లారీలు కొవ్వూరులో ఇసుకను లోడ్ చేసుకుని ఏలూరుకు వెళ్లాల్సి ఉండగా దారి మళ్లించడంతో తెలంగాణ సరిహద్దు.. ఏపీలోని జీలుగుమిల్లి వద్ద పోలీసులకు చిక్కాయి. ఓ లారీ మార్గమధ్యలో మరమ్మతులకు గురై దాదాపు 12గంటల పాటు ఏపీ భూభాగంలోనే ఉంది. అయినా అక్కడి పోలీసులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇదే లారీ తెలంగాణలోకి ప్రవేశించాక పట్టుబడింది.

సత్తుపల్లి గనుల్లో ఖనిజాలు...

ఏరియా జీఎం షాలేంరాజు



మాట్లాడుతున్న జీఎం షాలెం రాజు

సత్తుపల్లి: సత్తుపల్లిలోని సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో స్కాండియం, స్ట్రాటియం, నియోడియోనియం తదితర ఖనిజాలు ఉన్నట్లు గుర్తించామని కొత్తగూడెం ఏరియా జీఎం షాలెం రాజు వెల్లడించారు. స్థానిక జీఎం కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఇక్కడ ఖనిజాల ఆనవాళ్లను గుర్తించగా పరీక్షల కోసం హైదరాబాద్, భువనేశ్వర్‌కు చెందిన సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు. ఖనిజాల వెలికితీత సాధ్యాసాధ్యాలు పరిశీలించాక వాణిజ్యపరంగా అవసరమని భావిస్తే వెలికితీస్తామన్నారు. కాగా, సత్తుపల్లి కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్, సైలో బంకర్ మరమ్మతు పనులు త్వరలోనే చేపడతామని చెప్పారు. అంతేకాక కాంట్రాక్టర్‌గా వ్యవహరించిన సమంత కంపెనీపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సత్తుపల్లి ఏరియా జీఎం కార్యాలయం ఈ ఏడాది చివరికల్లా ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఇక్కడి ఓపెన్‌కాస్టుల్లో బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు కృషి చేస్తున్నామని తెలిపారు. అలాగే, సత్తుపల్లికి సీఎస్‌ఆర్ నిధుల కింద రూ.32 కోట్లు, డీఎంఎస్‌టీ నిధులు రూ.247 కోట్లను సింగరేణి తరఫున కేటాయించామని జీఎం వెల్లడించారు. కాగా, ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి సూచనలతో ఈనెల 26న సత్తుపల్లిలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పీఓలు ప్రహ్లాద్, నర్సింహారావు, ఎస్‌ఓటీ జీఎం కోటిరెడ్డి, ఎస్టేట్ ఆఫీసర్ శౌర్య పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు



డ్రా తీస్తున్న అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, ఏసీపీలు

ఖమ్మంక్రైం: రానున్న దీపావళి సందర్భంగా బాణసంచా షాప్‌లు ఏర్పాటుచేసే వారు నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు సూచించారు. తద్వారా ప్రమాదాలు జరగకుండా అరికట్టవచ్చని తెలిపారు. జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో 86, పెవిలియన్ మైదానంలో 42 షాపులు కలిపి 128షాప్‌ల ఏర్పాటుకు నిర్ణయించగా, 148మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో డ్రా తీసి షాప్‌లు కేటాయించారు. అనంతరం అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ పోలీసు, అగ్నిమాపక, మున్సిపల్ శాఖల సూచనతో షాప్‌లు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. విక్రయాల సమయాన తగిన జాగ్రత్తలు పాటించాలని, అనుమతి లేకుండా బాణాసంచా నిల్వ చేసినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, బాణాసంచాల షాప్‌లు ఇప్పిస్తామంటూ ఎవరైనా డబ్బు వసూలు చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈకార్యక్రమంలో నగర ఏసీపీ రమణమూర్తి, ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎకరాకు 300గజాల ప్లాట్

టీటీడీ ఆలయ నిర్మాణానికి సహకరించాలి



నాయకులు, రైతులతో సమావేశమైన తహసీల్దార్ సైదులు

ఖమ్మంఅర్బన్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యాన ఖమ్మంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి అసైన్డ్ భూములు కలిగిన రైతులు సహకరించాలని అర్బన్ తహసీల్దార్ దొడ్డారపు సైదులు కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన అల్లీపురం, కొత్తగూడెం రైతులతో సమావేశమయ్యారు. ఆలయ నిర్మాణ అవసరాలకు రైతులు భూమి ఇస్తే ఎకరాకు 300 గజాల చొప్పున అదే ప్రాంతంలో అన్ని వసతులతో అభివృద్ధి చేసిన ప్లాట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఇన్నాళ్లు అనుభవంలో ఉన్న అసైన్డ్ భూములను అమ్మడం, కొనడానికి హక్కు ఉండదని చెప్పారు. కానీ ఇందుకు బదులుగా ఇచ్చే ప్లాట్లపై పూర్తి హక్కులు లభిస్తాయని భరోసా కల్పించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో టీటీడీ ఆలయ నిర్మాణానికి నిర్మాణం చేపట్టనుందని.. తద్వారా ఈ ప్రాంతం ఆధ్యాత్మికంగా అభివృద్ధి సాధించనున్నందున రైతులు సహకరించాలని తహసీల్దార్ కోరారు. ఈసమావేశంలో వీ.వీ.పాలెం సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదుబాబు, నాయకులు వెనిగండ్ల సత్యనారాయణ, సంక్రాంతి నాగేశ్వరరావు, బర్ల కోటేశ్, రవి, గద్దల రాంబాబు, ఫ్రాన్సిస్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మీదుగా ‘భవ్య గుజరాత్’ రైలు

ఖమ్మంరాపర్తినగర్: గుజరాత్ రాష్ట్రంలోని పర్యాటక స్థలాలకు వెళ్లే వారి కోసం దక్షిణ మధ్య రైల్వే శాఖ ‘భవ్య గుజరాత్’ పేరిట ప్రత్యేక రైలు నడిపిస్తోంది. రేణిగుంట నుంచి బయలుదేరే ఈ రైలు ద్వారా తొమ్మిది రోజుల యాత్ర ఉంటుంది. గుజరాత్‌లోని ద్వారక, సోమనాథ్, మోడేరా, రాణీ కి వావ్(పటాన్), స్టాచ్యూ ఆఫ్ యూనిటీ తదితర స్థలాలను సందర్శించవచ్చని ఐఆర్‌సీటీసీ ప్రతినిధి తెలిపారు. ఖమ్మం మీదుగా వెళ్లే ఈ రైలులో ప్రయాణ వివరాల కోసం www.irctctourism.comలో సంప్రదించాలని సూచించారు.

ఈ మూడు రోజులే కీలకం

- 116 వైన్స్‌కు ఇప్పటివరకు 492 దరఖాస్తులే..
- 18వ తేదీతో ముగియనున్న గడువు



ఖమ్మంక్రైం: నూతన ఎక్సైజ్ పాలసీలో భాగంగా జిల్లాలోని 116 వైన్స్ కేటాయింపునకు టెండర్లు ఆహ్వానించగా ఇప్పటివరకైతే ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. గత నెల 26వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండగా ఈనెల 18వ తేదీ శనివారంతో గడువు ముగియనుంది. దీంతోచివరి మూడు రోజుల్లో అత్యధిక దరఖాస్తులు రాబట్టుకునేలా ఎక్సైజ్ శాఖ అధికారులు తమ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.

గత పాలసీలో గరిష్ఠం

జిల్లాలో గత ఎక్సైజ్ పాలసీలో వైన్స్‌కు అందిన దరఖాస్తుల ద్వారా రూ.144 కోట్లకు పైగా ఆదాయం నమోదైంది. అప్పట్లో దరఖాస్తు ఫీజు రూ.2లక్షలు ఉండగా ఈసారి రూ.3లక్షలకు పెంచారు. దీంతో ఈసారి కూడా గణనీయమైన సంఖ్యలో దరఖాస్తులు.. అదే స్థాయిలో ఆదాయం వస్తుందని అధికారులు భావించారు. కానీ బుధవారం నాటికి జిల్లావ్యాప్తంగా వైన్స్‌కు కేవలం 492 దరఖాస్తులు రావడం గమనార్హం. గడువు సమీపిస్తున్నా దరఖాస్తులు ఆశాజనకంగా లేకపోవడం.. మద్యం వ్యాపారంలో ఉన్న వారితో భేటీలు నిర్వహించి అవగాహన కల్పించినా ఫలితం లేకపోవడంతో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

పదుల సంఖ్యలోనే...

జిల్లాలో ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్-1, 2, నేలకొండపల్లి, మధిర, వైరా, సత్తుపల్లి సర్కిళ్లు ఉన్నాయి. వీటిలో ఇప్పటివరకు ఎక్సైజ్ స్టేషన్-1 పరిధిలోని వైన్స్‌కు దరఖాస్తులు అధికంగా వచ్చాయి. కొన్ని స్టేషన్ల పరిధిలో పదుల సంఖ్య కూడా దాటలేదు. అయితే గురువారం కూడా ఇదే పరిస్థితి ఉంటుందని, చివరి రెండు రోజులైన శుక్ర, శనివారాల్లో దరఖాస్తుదారులు పోటెత్తే అవకాశముంటుందని భావిస్తున్నారు. ఒకవేళ దరఖాస్తులు తగ్గినా ఫీజు రూ.3లక్షలుగా ఉన్నందున గతంలో మాదిరే ఆదాయం వస్తుందని ఆశిస్తున్నారు.

సిండికేట్ అవుతున్న వ్యాపారులు

దరఖాస్తు ధర గత పాలసీలో రూ.2లక్షలు ఉంటే ఈసారి రూ.3లక్షలకు పెంచడంతో వ్యాపారుపై ఒక్కో దరఖాస్తుకు రూ.లక్ష అదనపు భారం పడుతోంది. దీంతో వ్యాపారులు సిండికేట్‌గా మారి తమ ప్రాంతాల పరిధిలో బాగా అమ్మకాలు ఉండే షాపులను ఎంచుకుని కలిసొచ్చే వారి పేర్లతో టెండర్లు వేయటానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా గత పాలసీలో అధికంగా టెండర్లు వేసిన ఆంధ్రా వ్యాపారులు సైతం ఈసారి మరోమారు అదృష్టాన్ని పరీక్షించుకోవాలనే భావనతో ఉన్నట్లు తెలిసింది. జిల్లా వ్యాపారులతో పాటు ఏపీ వ్యాపారులతోనూ సమావేశమైన ఎక్సైజ్ అధికారులు అవగాహన కల్పించగా వారు ముందుకొచ్చినట్లు సమాచారం. అంతేకాక పలువురు రాజకీయ ప్రముఖులు సైతం బినామీల పేర్లతో టెండర్లు వేయాలనే భావనతో ఉన్నారని... వరంగల్, నల్లగొండ వ్యాపారులు సైతం ఖమ్మం జిల్లా వైపు చూస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

మున్నేటికి రిటైనింగ్ వాల్ మరింత...

13 కి.మీ. మేర పొడిగించేలా నిర్ణయం



సర్వే చేస్తున్న జలవనరులశాఖ ఉద్యోగులు

ఖమ్మంఅర్బన్: మున్నేటి వరద ముప్పు నుంచి పరీవాహక ప్రాంత ప్రజలను రక్షించేందుకు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపడుతుండగా, దీన్ని మరింత పొడిగించాలని నిర్ణయించారు. ఇప్పటికే రూ.690 కోట్ల అంచనా వ్యయంతో మున్నేటికి ఇరువైపులా సుమారు 17 కి.మీ. మేర రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మరికొన్ని కాలనీలకు కూడా ముప్పు పొంచి ఉన్నందున ఇంకా 13 కి.మీ. పొడిగించాలని నిర్ణయించారు. ఈమేరకు జలవనరుల శాఖ డీఈ ఉదయ్‌ప్రతాప్, ఏఈలు రాజేశ్వరరావు, సంతోష్‌రెడ్డితో పాటు వర్క్ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యాన సర్వే చేస్తున్నారు. గత ఏడాది మున్నేటికి వరద ముంచెత్తడంతో వేలాది ఇళ్లు ముంపునకు గురయ్యాయి. అలాంటి వరద మళ్లీ వచ్చినా ఇబ్బంది లేకుండా రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని పొడిగించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో ప్రకాశ్‌నగర్ వద్ద నుంచి ధంసలాపురం వద్ద నేషనల్ హైవే వంతెన వరకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి స్థల పరిశీలన చేపడుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం

- 72గంటల్లోపే రైతుల ఖాతాల్లోకి నగదు
- వీసీలో మంత్రులు ఉత్తమ్‌కుమార్, తుమ్మల నాగేశ్వరరావు



పంటల మద్దతు ధర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనుదీప్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసేలా అధికార యంత్రాంగం సిద్ధం కావాలని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ నుంచి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో కలిసి బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. జిల్లా నుంచి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లో 48 నుంచి 72గంటల్లో నగదు జమ అవుతుందనే విషయమై అవగాహన కల్పించాలని చెప్పారు. కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

నాణ్యమైన పంటకు మద్దతు ధర

ఖమ్మంవ్యవసాయం: నాణ్యమైన పంట ఉత్పత్తులకు మద్దతు ధర అందుతుందనే అంశంపై విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. మంత్రుల వీసీ అనంతరం అధికారులతో సమావేశమైన ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి వానాకాలం పంటల కనీస మద్దతు ధరల వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రేడ్ ‘ఏ’ రకం వరికి రూ.2,389తో పాటు రూ.500 బోనస్, సాధారణ రకానికి రూ. 2,369, పత్తి తేమశాతం ఆధారంగా గరిష్ఠంగా రూ.8,110, మొక్కజొన్న రూ.2,400 మద్దతు ధర నిర్ణయించారని చెప్పారు. కేంద్రాల ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. రైతులు కపాస్ కిసాన్ యాప్‌లో పత్తి విక్రయానికి స్లాట్ బుకింగ్ చేసుకునే అంశంపై అవగాహన కల్పించాలని సూచించారు. డీఆర్డీఓ సన్యాసయ్య, డీసీఎస్‌ఓ చందన్‌కుమార్, పౌర సరఫరాల సంస్థ డీఎం శ్రీలత, డీఏఓ డి.పుల్లయ్య, మార్కెటింగ్ అధికారి ఎం.ఏ.అలీం, జిల్లా రవాణా అధికారి వెంకటరమణ, జిల్లా సహకార అధికారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి

ఖమ్మం అర్బన్: జిల్లాలో కొత్త రోడ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచడమే కాక అవసరమైన చోట మరమ్మతులు చేయించాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. కలెక్టరేట్‌లో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారుల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. వర్షాలతో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. జిల్లా ప్రవేశం వద్ద నలువైపులా బోర్డులు ఏర్పాటు చేసి మొక్కలు నాటాలని తెలిపారు. అలాగే, బైపాస్ బ్రిడ్జి వెడల్పునకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఆర్ అండ్ బీ, విద్యుత్ ఎస్‌ఈలు యాకూబ్, శ్రీనివాసాచారి, నేషనల్ హైవే పీడీ రామాంజనేయరెడ్డి, ఈఈలు పవార్, తానేశ్వర్, యుగంధర్ దితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేస్తున్నారా?!

అభిప్రాయ సేకరణలో ఏఐసీసీ పరిశీలకుడు మహేంద్రన్



మాట్లాడుతున్న మహేంద్రన్, పక్కన ఎమ్మెల్యే రాగమయి తదితరులు

సత్తుపల్లి: పాత, కొత్త కాంగ్రెస్ కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తున్నారా.. స్థానిక సంస్థల్లో విజయం వరిస్తుందా.. అంటూ ఏఐసీసీ పరిశీలకుడు మహేంద్రన్ ఆరా తీశారు. జిల్లా అధ్యక్ష పదవి ఎంపికకు చేపడుతున్న అభిప్రాయ సేకరణలో భాగంగా సత్తుపల్లి, కల్లూరుల్లో బుధవారం సమావేశాలు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ సమావేశాల్లో మహేంద్రన్ పాల్గొనగా సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాలు, బ్లాక్‌ల వారీగా కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకున్నారు. జిల్లాలో పార్టీ పనితీరు ఎలా ఉందని ప్రశ్నించగా.. ముగ్గురు మంత్రులు పార్టీని ముందుకు నడిపిస్తున్నారని కార్యకర్తలు బదులిచ్చారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులుగా పాత నాయకులనే ఎంపిక చేయడంతో పనితీరు సంతృప్తిగానే ఉందని తెలిపారు.

అవకాశం ఇవ్వండి..

డీసీసీ అధ్యక్ష పదవిని డాక్టర్ మట్టా దయానంద్‌కు అప్పగించాలని పార్టీ శ్రేణులు కోరాయి. సత్తుపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి రాగమయి గెలుపునకు కృషి చేశారని, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన దయానంద్‌కు అధ్యక్ష పదవి అప్పగిస్తే పార్టీకి లాభం జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇతరులకు అవకాశం కల్పించాలనుకుంటే ఎమ్మెల్యే రాగమయి సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, నాయకులు మట్టా దయానంద్, తుమ్మల యుగంధర్, చక్కిలం రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెద్దాస్పత్రిలో టాస్క్‌ఫోర్స్ సభ్యుల తనిఖీ


జనరల్ ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న శశిశ్రీ

ఖమ్మంవైద్యవిభాగం: టాస్క్‌ఫోర్స్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు, వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ శశిశ్రీ బుధవారం ఖమ్మం జనరల్ ఆస్పత్రిని తనిఖీచేశారు. వివిధ వార్డులు, ఆపరేషన్ థియేటర్, డ్రగ్ స్టోర్‌ను పరిశీలించిన ఆమె అగ్నిమాపక నియంత్రణ పరికరాల నిర్వహణపై ఆరా తీశారు. అలాగే, మందుల లభ్యత, ఈ – ఔషధి పోర్టల్‌ను వివరాల నమోదుపై సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.నరేందర్‌తో సమీక్షించారు. రూ.5 లక్షలకు పైగా విలువైన పరికరాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. హెచ్‌ఈఈఓ వి.రవికుమార్, ఎం.దుర్గ, బయో మెడికల్ ఇంజనీర్ ఇస్లావత్ రెడ్డి, ఫార్మసీ సూపర్‌వైజర్ వై.పద్మావతి పాల్గొన్నారు. ఆ తర్వాత పాండురంగాపురం బస్తీ దవాఖానాను సైతం శశిశ్రీ తనిఖీ చేశారు.

వ్యాక్సిన్లతో వ్యాధుల వ్యాప్తికి చెక్



రికార్డులు పరిశీలిస్తున్న వెంకటరమణ

మధిర: బాలింతలు, గర్భిణులతో పాటు చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించడం ద్వారా వ్యాధులు దరిచేరవని జిల్లా వాక్సిన్ లాజిస్టిక్ మేనేజర్ చింతల వెంకటరమణ తెలిపారు. మధిర మండలంలోని దెందుకూరు, మడుపల్లి, మధిర పీపీ యూనిట్లలో బుధవారం వ్యాక్సినేషన్ శిబిరాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. టీకా ల నిల్వపై సిబ్బందిని ఆరా తీయడమేకాక డోసుల వారీగా క్రమం తప్పకుండా టీకాలు వేయాలని సూచించారు. అలాగే, ఆస్పత్రులకు వచ్చిన బాలింతలు, గర్భిణులకు టీకాల ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ పృథ్వీరాజ్‌నాయక్, సీహెచ్‌ఓ వి.వెంకటేశ్వర్లు, ఉద్యోగులు గోవింద్, లంకా కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గుండె జబ్బుల నిర్ధారణ శిబిరం

ఖమ్మంవైద్యవిభాగం: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఏపీ) జిల్లా కమిటీ ఆధ్వర్యాన హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రి సౌజన్యంతో బుధవారం చిన్నపిల్లల గుండె జబ్బుల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఐఏపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యాన ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన శిబిరంలో పెద్దసంఖ్యలో తల్లిదండ్రులు పిల్లలతో హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యులు భరత్‌కుమార్, సాయిభార్గవ్‌తో పాటు ఏఐజీ ఆస్పత్రి గుండె జబ్బుల వైద్యనిపుణులు చిన్న స్వామిరెడ్డి, లింగస్వామి చిన్నారులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ.. పిల్లల్లో గుండెజబ్బులకు కారణాలపై అవగాహన కల్పించడంతో పాటు చికిత్సకు ఉన్న అవకాశాలను వివరించామని తెలిపారు.

అత్యవసర సేవల వాహనాల తనిఖీ


వాహనం వద్ద సిబ్బందితో దుర్గాప్రసాద్

మధిర: మండలంలో 108, 1962, 102 వాహనాలను జిల్లా అత్యవసర సేవల అధికారి ఆవులూరి దుర్గాప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. వాహనాల పనితీరు, రోజువారి కేసులను రికార్డుల ఆధారంగా పరిశీలించారు. అత్యవసర సమయాల్లో కీలకమైన ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉద్యోగులు పేరెల్లి రవీంద్రబాబు, గుజ్జర్లపూడి రామయ్య, తాజుద్దీన్, వెంకటేశ్వర్లు, తోటపల్లి రాజేశ్, పశు వైద్యాధికారులు సౌజన్య, నందిని పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	4,700	2,900
ఏసీ మిర్చి	15,200	8,000
మిర్చి	8,000	6,000
పత్తి	7,211	4,600

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.19,400

పిల్లల్లో పోషణ లోపం

- బరువు తక్కువగా మరికొందరు..
- 'పోషణ మాసం' సర్వేలో గుర్తింపు
- మాతాశిశు సంరక్షణే లక్ష్యంగా అవగాహన సదస్సులు


చిన్నారుల బరువు చూస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



పోషకాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సత్తుపల్లిటౌన్: పిల్లలకు అందించాల్సిన పోషకాహారంపై తల్లిదండ్రులకు అవగాహన లేక సమస్యలు ఏర్పడుతున్నాయి. పిల్లల పోషణతో పాటు ఆరోగ్యం మెరుగుపర్చడమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నా పూర్తిస్థాయిలో ఫలితాలు రావడంలేదు. సరైన పోషకాలు అందక పలువురు చిన్నారుల్లో ఎదుగుదల లోపిస్తోంది. ఈ నేపథ్యాన అంగన్‌వాడీల ద్వారా చిన్నారుల్లో బలహీనత, రక్తహీనత, పోషణ లోపాలు నివారించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. జిల్లాలో కల్లూరు, కామేపల్లి, ఖమ్మం రూరల్, ఖమ్మం అర్బన్, మధిర, సత్తుపల్లి, తిరుమలాయపాలెంలలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో తల్లిదండ్రులతో పాటు ఇతర లబ్ధిదారులకు అవగాహన కల్పించేలా 'పోషణ మాసం' నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు అతి తీవ్రలోపపోషణ, తీవ్ర లోపపోషణతో 1,940 మంది చిన్నారులు, అతితక్కువ బరువు, తక్కువ బరువుతో 4,171 మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించారు.

ప్రత్యేక ప్రణాళికతో..

బాల్యం బాగుంటే భవిష్యత్ బంగారుమయమవుతుందనే నినాదంతో ప్రభుత్వం మాతాశిశు సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా ఏటా గర్భిణులు, బాలింతలు చిన్నారుల ఆరోగ్య రక్షణ కోసం ఐసీడీఎస్ ఆధ్వర్యాన సెప్టెంబర్ 17వ తేదీనుంచి అక్టోబర్ 16వ తేదీవరకు పోషణ మాసం కార్యక్రమాలు నిర్వహిస్తారు. గర్భం దాల్చినప్పటి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం ఆవశ్యకతతో పాటు బాలింతలు, చిన్నారులకు అందించాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతారు. ఈ సమయాన చిన్నారుల ఆరోగ్యాన్ని పరీక్షించి లోపాలను గుర్తించడంతో పాటు అందించాల్సిన ఆహారంపై అవగాహన కల్పిస్తున్నారు.

లోపాలను అధిగమించేలా..

ఆరోగ్యకర జీవనశైలిని అలవాటు చేయడమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు స్థానికంగా లభించే కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల ద్వారా పోషకాలపై అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాక చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్‌గార్డెన్ల పెంపకం చేపట్టి అందులో పండించే కూరగాయల ద్వారా భోజనం సమకూరుస్తారు. అలాగే, చిన్నారుల ఎత్తు, బరువు పరీక్షించి పరిస్థితులు మెరుగపడేలా బాలామృతం, క్యాల్షియం, ఐరన్ మాత్రలు పంపిణీ చేపడుతున్నారు. అంతేకాక పోషకాహారం, తల్లిపాల ఆవశ్యకతపై ర్యాలీలు, సదస్సులతో అవగాహన పెంపొందిస్తున్నారు.

జిల్లాలో అంగన్‌వాడీలు, చిన్నారుల వివరాలు

అంగన్‌వాడీ కేంద్రాలు	1,840
0-6ఏళ్ల లోపు చిన్నారులు	67,263
అతి తీవ్రలోపం గల పిల్లలు	170
తీవ్ర పోషణ లోప పిల్లలు	1,770
అతి తక్కువ బరువు పిల్లలు	669
తక్కువ బరువు చిన్నారులు	3,502

చిన్నారులపై ప్రత్యేక దృష్టి



ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేలా ప్రత్యేక దృష్టి సారించింది. ఈక్రమంలోనే పోషణమాసంలో వయస్సుకు తగిన బరువు లేని చిన్నారుల ఎదుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. ఆహారంలో పాలు, పండ్లు, కూరగాయలు, చిరు ధాన్యాలను చేర్చడం వల్ల ప్రయోజనాలను వివరిస్తున్నాం.

– రాంగోపాల్‌రెడ్డి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారి

బాల రచయితగా పోతురాజు

సంచార కుటుంబం నుంచి సాహితీ లోకంలోకి..


తల్లిదండ్రులతో పోతురాజు

సత్తుపల్లిరూరల్: ప్రతిభ ఎవరి సొంతమూ కాదు.. పట్టుదల, కృషిచేసి ఉంటే ఏ స్థాయికైనా ఎదగొచ్చని నిరూపించాడు సత్తుపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన 14 ఏళ్ల విద్యార్థి ఆవుల పోతురాజు. ఇప్పటివరకు విద్యార్థి 20 కథలు రాయగా, వీటిని గార్లపాటి – బొల్లేపల్లి ట్రస్ట్ నిర్వాహకులు జి.రామకృష్ణ, బి.మధుసూదన్‌రాజు ఆధ్వర్యాన పుస్తకంగా తీసుకొస్తున్నారు. ఈ మేరకు బుధవారం వారు వివరాలను వెల్లడించారు. పెనుబల్లి మండలం టేకులపల్లికి చెందిన ఆవుల యాకయ్య – తిరుపతమ్మకు మారేషు, అంకిత, పోతురాజు ముగ్గురు సంతానం. గంగిరెద్దుల సామాజిక వర్గానికి చెందిన యాకయ్య కుటుంబం పదేళ్ల క్రితం సత్తుపల్లికి చేరుకొని గుడిపాడురోడ్డు చివర గుడారం వేసుకొని గంగిరెద్దులను ఆడిస్తూ జీవనం సాగిస్తోంది. సత్తుపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పోతురాజు 9వ తరగతిలో ఉన్నప్పుడే వేమన శతకంలోని వంద పద్యాలు నేర్చుకుని అవధానం చేశాడు. అయితే, పోతురాజుకు కథలు రాసే నైపుణ్యం ఉందని గ్రహించిన తెలుగు ఉపాధ్యాయురాలు ఎం.రమాదేవి ప్రోత్సహించగా ఇరవై కథలు రాశాడు. దీనికి హెచ్‌ఎం సోందు షేక్ పోతురాజుకు సహకరించారు. ఆపై విషయం గార్లపాటి, బొల్లేపల్లి ట్రస్ట్ బాధ్యులకు చేరడంతో పుస్తకాన్ని ప్రచురించడానికి సిద్ధమయ్యారు. దాతల చేయూతతో పుస్తక ప్రచురణ చివరి దశకు చేరిందని రామకృష్ణ, మధుసూదన్‌రాజు తెలిపారు.

18న బంద్‌ను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఖమ్మంమామిళ్లగూడెం: బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 18న చేపడు తున్న రాష్ట్రవ్యాప్త బంద్‌ను జిల్లాలో విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘంజిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్ పిలుపునిచ్చా రు. ఖమ్మం అంబేడ్కర్ భవనంలో బుధవారం జరిగిన కుల సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న నేపథ్యాన కుల సంఘాలు ఏకం కావాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు. ఈ మేరకు 14మంది కన్వీనర్లను నియమించా రు. నాయకులు, పుల్లారావు, శివ, వెంకట్రామ య్య, వీరన్న, సుంకర శ్రీనివాస్, రామ్మూర్తి గౌడ్, కృష్ణమాచారి, మధుగౌడ్, పిండిప్రోలు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు మాస్‌లైన్ మద్దతు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా బిల్లును ఆమోదించకపోవడం, ఇతర అంశాలను నిరసిస్తూ బీసీ సంఘాలు ఈ నెల 18న ఇచ్చిన రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇస్తున్నట్లు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్య దర్శి పోటు రంగారావు తెలిపారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల వర్గీకరణ జరగాలని పేర్కొన్నారు. ఈ క్రమాన బీసీల పోరాటానికి అండగా నిలిచేలా బంద్‌కు మద్దతు ప్రకటించినట్లు రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు.

వైరా: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఈనెల 18న చేపట్టిన రాష్ట్ర బంద్‌కు బీసీ సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని జిల్లా అధ్యక్షుడు బి.కృష్ణయ్య, నాయకులు అమ్మిక రామారావు తెలిపారు. వైరాలో జరిగిన సంఘం నియోజకవర్గ స్థాయి సమావేశంలో వారు మా ట్లాడారు. నాయకులు ఓర్సు శ్రీనివాసరావు, దరిపల్లి శ్రీనివాస్, మాచర్ల యుగంధర్, దేవరకొండ కృష్ణ పాల్గొన్నారు.

పాడిసంపదతో రైతుల ఆర్థికాభివృద్ధి


టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు, నీరజ

కల్లూరురూరల్/ఖమ్మంవ్యవసాయం: రైతులు వ్యవసాయం చేస్తూనే పాడి పశువుల పోషణ ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించొచ్చని జిల్లా పశు సంవర్ధక, పశువైద్యాధికారి బోడేపూడి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కల్లూరు మండలంలోని కొర్లగూడెంలో పశువులకు టీకాలు వేసిన ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 14 వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. సకాలంలో టీకాలు వేయిస్తే పశువులు ఆరోగ్యంగా ఉంటాయని చెప్పారు. నిర్లక్ష్యం చేస్తే పశువులు మేత తినక నీరసిస్తాయని, పాల దిగుబడి పడిపోతుందని తెలిపారు. ఈ మేరకు రైతులు తమ గేదెలు, దున్నలతో పాటు ఆవులు, ఎద్దులకు టీకాలు వేయించాలని సూచించారు. పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రల ద్వారా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో కల్లూరు మార్కెట్ చైర్మన్ బాగం నీరజ, పశువైద్యాధికారులు మమత, సఫియా, ఉద్యోగులు శ్రీనివాస్, కె.రామకృష్ణ, ఆమని, నయీమ్, శ్రీను, నాగరాజు, గోపాలమిత్ర పాల్గొన్నారు.

కాపురానికి తీసుకెళ్లడం లేదని నిరసన

వైరారూరల్: ప్రేమ పెళ్లి చేసుకున్న వ్యక్తి తనను కాపురానికి తీసుకెళ్లడం లేదని ఓ మహిళ బుధవారం నిరసనకు దిగింది. వైరా మండలం తాటిపూడికి చెందిన బండారుపల్లి సురేశ్, తల్లాడ మండలం నారాయణపురానికి చెందిన రమణను రెండేళ్ల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. వీరిద్దరి కులాలు వేరు కావడంతో సురేశ్ కుటుంబీకులు అంగీకరించలేదు. దీంతో సురేశ్ వారి మనస్సు మార్చి కాపురానికి తీసుకెళ్తానంటూ పుట్టింటి వద్దే ఉంచి అప్పుడప్పుడు వెళ్లి వచ్చేవాడు. కానీ, 11 నెలలుగా రాకపోవడం, రమణను తీసుకెళ్లకపోవడంతో ఆమె బుధవారం తాటిపూడిలో సురేశ్ ఇంటి ఎదుట నిరసన తెలిపింది. ఆ సమయాన సురేశ్, ఆయన తల్లి శారద తనపై దాడిచేసి కులం పేరుతో దూషించారని వా పోయింది. ఈ మేరకు వైరా ఎస్‌ఐ పి.రామారావు చేరుకుని రమణకు సర్దిచెప్పగా.. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు

ఖమ్మంసహకారనగర్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 17న సాయంత్రం 5 గంటల్లోగా ఖమ్మంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జూనియర్ కళాశాలలో దరఖాస్తు అందజేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల వారు రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.2 లక్షలు వార్షిక ఆదాయం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జత చేయాలని సూచించారు. వీజీటీ సెట్, బీఎల్‌వీ సెట్ రాసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని, పరీక్ష రాయని వారిలో అనాథలకు సీట్లు కేటాయించాక మిగిలితే ఈ నెల 18న టేకులపల్లి గురుకులంలో జరిగే డ్రా ద్వారా ఎంపిక చేస్తామని కలెక్టర్ వివరించారు. వివరాల కోసం 90004 98046 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కర్షక సేవా సంఘం పాలకవర్గం పొడిగింపు

ఖమ్మంఅర్బన్: టేకులపల్లి ఆంధ్రాబ్యాంక్ కర్షక సేవా సంఘం లిమిటెడ్ పాలకవర్గం పదవీ కాలాన్ని పొడిగించారు. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. అయితే, ఇద్దరు డైరెక్టర్లు రుణాలను చెల్లించకపోవడంతో వారిని డిఫాల్టర్లుగా గుర్తించి జాబితాలో చేర్చలేదని తెలిసింది. మిగతా డైరెక్టర్లు, చైర్మన్, వైస్ చైర్మన్ పదవీ కాలాన్ని మాత్రం పొడిగించడంతో కొన్నాళ్లుగా నిలిచిపోయిన రుణాల మంజూరు, ఇతర వ్యవహారాలు కొనసాగనున్నాయి.

విజయవాడలో కారేపల్లి వాసి ఆత్మహత్య


హరిచందర్ (ఫైల్)

కారేపల్లి: కుటుంబ సమస్యల నేపథ్యాన ఓ వ్యక్తి విజయవాడలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కారేపల్లి మండలం ఆలియాతండా గ్రామానికి చెందిన బానోతు హరిచందర్ (32) విజయవాడలో ఓ రెసిడెన్షియల్ స్కూల్‌లో వార్డెన్‌గా పనిచేస్తున్నాడు. కొన్నాళ్లుగా కుటుంబ సమస్యలు ఉండడంతో ఆవేదన చెందిన ఆయన విజయవాడలోనే ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ మేరకు మృతదేహాన్ని బుధవారం స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, హరిచందర్‌కు భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

రూ.74 వేల విలువైన గంజాయి స్వాధీనం

కామేపల్లి: ఒడిశా నుంచి గంజాయి తీసుకొస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. మండలంలోని ముచ్చర్ల క్రాస్ రోడ్డులో బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా జాస్తిపల్లికి చెందిన పల్లపు వేణు, ముచ్చర్లకు చెందిన షేక్ యాసిన్ బైక్‌పై వెళ్తూ పోలీసులను చూసి పారిపోయే యత్నం చేశారు. వారిని పట్టుకుని బ్యాగ్‌లో తనిఖీ చేయగా రూ.74,250 విలువైన 1.485 కేజీల గంజాయి ప్యాకెట్లు లభించాయి. ఒడిశాకు చెందిన అభి నుంచి గంజాయి కొనుగోలు చేసి తీసుకొస్తున్నారని తేలడంతో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

కడవరకూ తోడుగానే...

భర్త దశదిన కర్మలోగా భార్య మృతి


పుల్లారెడ్డి - సత్యవతి (ఫైల్)

సత్తుపల్లిరూరల్: ఇటీవలే భర్త మృతి చెందాడు. అప్పటి నుంచి ఆయనను తలుచుకుంటూ కన్నీరుమున్నీరుగా రోదిస్తున్న భార్య సైతం కన్నుమూసింది. భర్త దశదిశ కర్మకు ఓ రోజు ముందే ఈ ఘటన జరగడం కుటుంబంలో విషాదాన్ని నింపింది. సత్తుపల్లి మండలం రేజర్లకు చెందిన సంధ్యాల పుల్లారెడ్డి (90) అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 2వ తేదీన మృతి చెందాడు. అప్పటినుంచి ఆయన భార్య సత్యవతి(80) నిద్రాహారాలు మాని రోదిస్తోంది. ఈ క్రమాన గురువారం పుల్లారెడ్డి దశదిన కర్మకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తుండగానే, సత్యవతి బుధవారం ఉదయం కన్నుమూసింది. దీంతో ఆయన కుటుంబంతో పాటు బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. కాగా, పుల్లారెడ్డి దంపతులకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

పాఠశాలలకు క్యాలెండర్లు!

- నెలల వారీగా కార్యకలాపాల ముద్రణ
- పరీక్షలు, సెలవుల వివరాలతో రూపకల్పన
- సవివరంగా సమావేశాలు, ముఖ్య తేదీలు కూడా..



పాఠశాలలకు అందిస్తున్న అకడమిక్ క్యాలెండర్



అక్టోబర్ నెల పేజీలోని వివరాలు

ఖమ్మంసహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు అకడమిక్ క్యాలెండర్లను అందిస్తోంది. ఈ విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో వీటిని సరఫరా చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాకు ఇటీవలే క్యాలెండర్లు చేరగా.. 1,137 ప్రభుత్వ పాఠశాలలకే కాక కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఈఓ కార్యాలయంతో పాటు ఎమ్మార్సీలు, పాఠశాలలకు అందించనున్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రాలకు చేరిన ఈ క్యాలెండర్లను పాఠశాలలకు పంపిస్తున్నారు.

లక్ష్యం ఇలా..

పాఠశాల విద్యాశాఖ ప్రతీ విద్యార్థికి ఉచితంగా, సమానంగా, నాణ్యమైన విద్య అందేలా చేయడమే ప్రధాన లక్ష్యంగా నిర్దేశించుకుంది. ప్రతీ విద్యార్థిలో పఠనం, లెక్కలు, శాస్త్రీయ ఆలోచన, డిజిటల్ పరిజ్ఞానం వంటి అంశాల్లో దృఢమైన పునాదులను ఏర్పర్చేలా కృషి చేస్తున్నట్లు చెబుతున్నారు. విద్యార్థి సమగ్ర అభివృద్ధి కోసం 21వ శతాబ్దపు నైపుణ్యా లు, విలువలు, సామాజిక – భావోద్వేగ సౌఖ్యాన్ని పెంపొందించడమనే లక్ష్యాలను క్యాలెండర్లపై ముద్రించారు.

ఆకట్టుకునేలా క్యాలెండర్లు

ప్రభుత్వం పాఠశాలలకు అందిస్తున్న క్యాలెండర్లు ఆకట్టుకునేలా ఉన్నాయి. క్యాలెండర్‌పై ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన రావడమే కాక రోజువారీ కార్యక్రమాలు అర్థమయ్యేలా రూపొందించారు. విద్యావిధానాన్ని తెలియజేస్తూనే ఒక్కో నెల పేజీపై నీతి సందేశం ముద్రించారు. పాఠశాల పనిదినాలు, పండుగలు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు, తల్లిదండ్రులు, పాఠశాల సముదాయ సమావేశాలు, సెలవులు, వైజ్ఞానిక ప్రదర్శనల వివరాలు కూడా పొందుపరిచారు. అలాగే, యోగా, ధ్యానం, బ్యాగ్‌లు లేకుండా పాఠశాలలకు వచ్చే వివరాలు కూడా ముద్రించారు.

గతంలో ఫోన్‌లోనే..

ఇప్పటివరకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు అకడమిక్ క్యాలెండర్‌ను ఫోన్‌లోనే పంపించే వారు. ఈసారి కొత్తగా ముద్రించి పంపిణీ చేస్తున్నారు. దీనిపై అన్ని వివరాలు ఉండడంతో ఏయే తేదీల్లో ఏయే కార్యక్రమాలు నిర్వహించాలో తెలిసిపోతుంది.

ఆరోగ్యశ్రీ డీఈఓల సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక


డీఈఓల నూతన కార్యవర్గం

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ ఆస్పత్రుల్లోని ఆరోగ్యశ్రీ డేటా ఎంట్రీ ఆపరేటర్ల (డీఈఓలు) సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖమ్మంలో బుధవారం జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరగగా, డీఈఓల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గం వివరాలను టీఎన్జీవోస్ రాష్ట్ర నాయకుడు నందగిరి శ్రీనివాస్ ప్రకటించారు. సంఘం అధ్యక్షుడిగా కె.వినయ్‌కుమార్(ఖమ్మం), అసోసియేట్ అధ్యక్షుడిగా కె.శ్రీహరి(దుబ్బాక), కార్యదర్శిగా జి.సుధాకర్(భద్రాచలం), కోశాధికారి గా పి.సంతోష్(గజ్వేల్)ను ఎన్నుకున్నారు. అలా గే, ఉపాధ్యక్షులుగా ఎన్.ఎల్లేశ్(జనగామ), పి.సంతోష్(మెదక్), సహాయ కార్యదర్శిగా బి.సతీశ్(వరంగల్), శోభ(కరీంనగర్), ప్రచార కార్యదర్శిగా బి. గౌతమ్(కామారెడ్డి), ప్రచార కార్యదర్శిగా మౌని క (బాన్సువాడ), కార్యవర్గ సభ్యులుగా ఎస్‌కెఇమ్మాన్(కామారెడ్డి), జి.సాగర్(ఖమ్మం), సునీల్(బూర్గంపాడు)ను ఎన్నుకున్నారు.

అంగన్‌వాడీల్లో పోషకాహారం


గర్భిణులతో డీడబ్ల్యూఓ, అధికారులు

జిల్లా సంక్షేమాధికారి రాంగోపాల్‌రెడ్డి

చింతకాని: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి కె.రాంగోపాల్‌రెడ్డి సూచించారు. పోషణ మాసోత్సవంలో భాగంగా చింతకాని రైతువేదికలో బుధవారం గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేయించారు. ఈ సందర్భంగా డీడ బ్ల్యూఓ మాట్లాడుతూ.. పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని తెలిపారు. అంతేకాక పిల్లల్లో మానసిక, శారీరక అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. పోషకాహార లోపంతో చాలా మంది పిల్ల లు రక్తహీనతతో బాధపడుతున్నందున బాలింతలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనం తరం తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహారం తయారీపై ప్రదర్శన నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీ ఓ కమలప్రియ, ఎంపీడీఓ చుంచు శ్రీనివాసరావు, తహసీల్దార్ బాబ్జీప్రసాద్, మండల వైద్యాధికారి ఆల్తాఫ్, వెంకటేశ్వర్లు, ఉద్యోగులు షామిలి, పద్మావతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అడవి పంది మాంసం స్వాధీనం

సత్తుపల్లి: కలుపు నివారణ మందు తాగిన అడవి పంది మృతి చెందగా, పోగులు వేసుకుంటున్నట్లు తెలియడంతో అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వేంసూరు మండలం ఎర్రగుంటపాడులో రైతు వాసం వెంకటేశ్వరరావు తన వరి పొలంలో పురుగుల మందు పిచికారీ చేశాడు. ఆ పొలంలో నీరు తాగిన అడవి పంది ఇటీవల మృతి చెందింది. ఇది గుర్తించిన వాసం రామకృష్ణ, వాసం వెంకటేశ్వరరావు, చిలకా సాయి సమీపంలోని ఆయిల్‌పామ్ తోటలోకి తీసుకెళ్లి భాగాలు చేసుకుంటున్నారు. ఈ విషయమై అందిన సమాచారంతో బుధవారం ఎఫ్‌ఎస్‌ఓ నరసింహా, సిబ్బంది తనిఖీలు చేపట్టి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని సత్తుపల్లి అటవీ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.